

వంజంగి మేఘాల కొండ కిటకిట

పాడేరురూరల్, జనవరి 16: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశం వంజంగి మేఘాల కొండకు పర్యాటకులు మంగళవారం పోటెత్తారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో మైదాన ప్రాంతం నుంచి వేలాది మంది పర్యాటకులు తరలివచ్చారు. వేకువజాము 5 గంటల నుంచే మేఘాల కొండకు చేరుకున్నారు. మంచు మేఘాలను తిలకించి పరవశించారు. ఫొటోలు దిగుతూ సందడి చేశారు. అక్కడ నుంచి ఎక్కువ మంది జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతానికి తరలి వెళ్లారు.

సంత షెడ్లు నిరుపయోగం

ఏజెన్సీ వ్యాప్తంగా 17 వారపు సంతల్లో రూ.68 లక్షలతో నిర్మాణం

- వినియోగంలో లేక చిరు దుకాణాలకు వసతి సమస్య



హుకుంపేటలో నిరుపయోగంగా ఉన్న సంత షెడ్లు



పాడేరులో వసతి లేక బహిరంగ ప్రదేశాల్లో కూరగాయలు విక్రయిస్తున్న గిరిజన మహిళలు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

ఏజెన్సీ వారపు సంతల్లో నిర్మించిన సంత షెడ్లు నిరుపయోగంగా మారాయి. ఇదే క్రమంలో సంతల్లో వసతి సదుపాయం లేక చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీలో గిరిజనులకు వారపు సంతలే ప్రధాన మార్కెట్‌లు. దీంతో ప్రతి అవసరానికి గిరిజనులు వారపు సంతలపైనే ఆధారపడతారు. ఒక్క మాటలో చెప్పాలంటే సంతలే వారికి సూపర్ మార్కెట్‌లు. దీంతో ఏజెన్సీలో ఎంపిక చేసిన 17 సంతల్లో రూ.68 లక్షల వ్యయంతో షెడ్లు నిర్మించారు. కానీ వాటి వినియోగంపై అధికారులు, వర్తకులు, గిరి రైతులు ప్రత్యేక శ్రద్ధ కనబరచకపోవడంతో ప్రస్తుతం అవి వినియోగానికి దూరమయ్యాయి. దీంతో ఏజెన్సీ వారపు సంతల్లో చిరు వర్తకులకు వసతి పెద్ద సమస్యగా మారింది.

ఏజెన్సీలోని వారపు సంతల్లో చిరు వర్తకులకు ఉపయోగపడాయనే ఆలోచనతో గతంలో సంత షెడ్లను నిర్మించారు. ఒక్కో సంత షెడ్‌లో 40 దుకాణాలు ఉండేలా ఒక్కో సంతలో రూ.4 లక్షల వ్యయంతో వాటిని గుత్తులపుట్టు, హుకుంపేట, కించుమండ, జి.మాడుగుల, వంట్లమామిడి, పెదబయలు, ముంచంగిపుట్టు, అరకు, సుంకరమెట్ట, డముకు, అనంతగిరి, కాశీపట్నం, అన్నవరం, చింతపల్లి, జీకేవీధి, ఆర్వీనగర్, కాకరపాడు ప్రాంతాల్లో నిర్మించారు. అయితే వాటి నిర్మాణం విషయంలో మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుల అభిప్రాయాలకు విరుద్ధంగా వ్యవహరించారు. దీంతో సంతల్లో నిర్మించిన షెడ్లు వినియోగానికి దూరమయ్యాయి. వర్తకులు షెడ్లలో దుకాణాలు పెట్టుకునేందుకు వీలు లేకపోవడంతో పాటు, షెడ్లలో దుకాణాలను నిర్వహిస్తే క్రయవిక్రయాలు సాగని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఏజెన్సీ వారపు సంతల్లో నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి.

వసతి లేక చిరు వర్తకుల అవస్థలు

ఏజెన్సీ వారపు సంతల్లో తమ దుకాణాలు పెట్టుకునేందుకు సరైన వసతి లేకపోవడంతో చిరు వర్తకులు అవస్థలు పడుతున్నారు. ఏజెన్సీలో ఎక్కువ కాలం వర్షాలు కురవడంతో సంతల్లో దుకాణాలను నిర్వహించడానికి నానా యాతన పడుతున్నామని వారంటున్నారు. సంతల్లో రేకుల షెడ్ల నమూనాలో చిన్నచిన్న షెడ్లను నిర్మిస్తే అందులో దుకాణాలు పెట్టుకోవడానికి అనువుగా ఉంటుందని ... మిగతా 8వ పేజీలో

మన్యంపై మంచు దుప్పటి

- కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగినా తగ్గని మంచు ప్రభావం



పాడేరులో మంగళవారం ఉదయం కమ్ముకున్న పొగమంచు

పాడేరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి):

మన్యంలో మంచు దుప్పటి కమ్మేసింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పటికీ మంచు, చలి తీవ్రత కొనసాగుతున్నది. జిల్లా కేంద్రం పాడేరులో మంగళవారం ఉదయం పది గంటల వరకు పొగమంచు వీడలేదు. అలాగే మంగళవారం ఏజెన్సీలోని పాడేరు, చింతపల్లి, అరకులోయ ప్రాంతాల్లో సైతం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 13 డిగ్రీల సెల్సియస్ పైబడే నమోదయ్యాయి. కానీ పొగమంచు, చలి తీవ్రత మాత్రం తగ్గుముఖం పట్టలేదు. దీంతో మన్యం వాసులు చలికి వణుకుతున్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: ఏజెన్సీ వ్యాప్తంగా గత 20 రోజులుగా 15 డిగ్రీల కంటే తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో చలి తీవ్రత అధికంగా ఉన్నది. మంగళవారం చింతపల్లిలో 13.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. చలితో పాటు మంచు దట్టంగా కురుస్తున్నది. చింతపల్లి, లంబసింగి, తాజంగి, జీకేవీధి ప్రాంతాల్లో ఉదయం పదిన్నర గంటల వరకు మంచు వీడడం లేదు. చలి, మంచు వల్ల గిరిజన ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు స్థానిక ప్రజలు అధిక సమయం ఉన్ని దుస్తుల్లో కనిపిస్తున్నారు.



చింతపల్లిలో కురుస్తున్న మంచు

బస్సుల కోసం పడిగాపులు

పండుగ వేళ 16 సర్వీసులను రద్దు చేసిన పీటీడీ అధికారులు

- గంటల తరబడి బస్ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల నిరీక్షణ
- గత్యంతరం లేక సర్వీసు జీపుల్లో స్వగ్రామాలకు పయనం



బస్సులో సీట్ల కోసం ప్రయాణికుల అవస్థలు

పాడేరు రూరల్, జనవరి 16: సంక్రాంతి పండుగ నేపథ్యంలో రద్దీ పెద్దగా ఉండదని భావించిన ప్రజా రవాణా శాఖ(పీటీడీ) అధికారులు కనుమ రోజైన మంగళవారం 16 బస్సు సర్వీసులను రద్దు చేశారు. పాడేరు డిపోలో మొత్తం 45 బస్సులకు గాను 16 రద్దు చేయడంతో పాడేరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం కాంప్లెక్స్‌లో నిరీక్షించారు.



సమయానికి బస్సులు లేక ప్రైవేటు జీపులో వెళుతున్న ప్రయాణికులు

పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని మారుమూల గ్రామాలకు వెళ్లాల్సిన కొంత మంది ప్రయాణికులు గత్యంతరం లేక సర్వీసు జీపులు, ఆటోలను ఆశ్రయించారు. పండుగకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యే పలువురు ఉద్యోగులు చోడవరం, విశాఖపట్నం, అనకాపల్లి, నర్సీపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించి బస్సు వచ్చే సరికి సీట్ల కోసం పోటీ పడ్డారు. మంగళవారం పీటీడీ కాంప్లెక్స్‌లోని విచారణ కేంద్రంలో ఎవరూ లేకపోవడంతో బస్సుల సమాచారం తెలియక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

బోసిపోయిన పట్టణం

పాడేరు రూరల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో అధిక శాతం జనం స్వగ్రామాలకు వెళ్లిపోవడంతో సోమ, మంగళవారాలు పాడేరు పట్టణం నిర్మానుష్యంగా కనిపించింది. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం మండలానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాడేరులో నివాసముంటారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో సుమారు 80 శాతం మంది ప్రజలు స్వగ్రామాలకు తరలివెళ్లిపోవడంతో వ్యాపార దుకాణాలు మూతపడ్డాయి. జన సంచారం లేకపోవడంతో నిత్యం రద్దీగా ఉండే పీటీడీ కాంప్లెక్స్ రోడ్డు, పీఎంఆర్సీ రోడ్డు, సినిమా హాలు జంక్షన్, అంబేడ్కర్ కూడలి నిర్మానుష్యంగా మారాయి.



నిర్మానుష్యంగా ఉన్న పీటీడీ కాంప్లెక్స్ రోడ్డు

ఉత్సాహంగా పీఎం జన్‌మన్



ఆదిమజాతి గిరిజనులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

అరకులోయ, జనవరి 16: మండలంలోని కొత్తభల్లుగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మైదానంలో ఆదిమజాతి గిరిజనులతో ప్రధాని నరేంద్ర మోదీ ముఖాముఖి కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా సాగింది. ఆదిమజాతి గిరిజనులతో మోదీ పలు అంశాలు చర్చించారు. వారి నుంచి పలు వివరాలు సేకరించారు. పీఎం జన్‌మన్ పథకం గురించి ఆరా తీశారు. అనంతరం అర్హులకు ఆధార్ కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు, అటవీ హక్కు పత్రాలు, జన్‌ధన్ ఖాతాలను జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో అభిషేక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ దేశంలోని ఐదు రాష్ట్రాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, గిరిజన వ్యవహారాల శాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, కేంద్ర వ్యవహారాల జాయింట్ సెక్రటరీ మనోజ్‌కుమార్ సింగ్, ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

- ప్రధాని నరేంద్రమోదీ - వార్త మెయిన్‌లో..



త్వరలో అందుబాటులోకి మేలిరకం రాజ్‌మా

ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రయోగాత్మక సాగు విజయవంతం

- గిరిజన ప్రాంతంలో అరుణ్, జ్వాల అత్యంత అనుకూలం
- వచ్చే ఏడాది అభ్యుదయ రైతులకు విత్తనాల పంపిణీ



అరుణ్ రకం రాజ్‌మా విత్తనాలు



పరిశోధన స్థానంలో ఏపుగా పెరిగిన జ్వాల రకం రాజ్‌మా పంట(ఫైల్)

చింతపల్లి, జనవరి 16:

ఆదివాసీ రైతులకు మేలి రకం రాజ్‌మా విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు స్థానిక ఆచార్య ఎన్‌జీ రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చేపడుతున్న ప్రయోగాత్మక సాగు విజయవంతమైంది. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని అరుణ్, జ్వాల రకాలు మంచి దిగుబడులు ఇచ్చాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వచ్చే ఏడాది విత్తనాభివృద్ధి లక్ష్యంగా అభ్యుదయ రైతులకు మినీ కిట్ల రూపంలో నూతన వంగడాలు పంపిణీ చేస్తామని శాస్త్రవేత్తలు అంటున్నారు.

దక్షిణ భారత దేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే రాజ్‌మా పండుతోంది. ఆదివాసీ రైతులు 40 ఏళ్లగా రాజ్‌మా పంటను సంప్రదాయేతర వాణిజ్య పంటగా సాగు చేస్తున్నారు. 12 ఏళ్ల క్రితం వరకు ఆదివాసీ రైతులు సుమారు 45 వేల హెక్టార్లలో రాజ్‌మాను సాగుచేసేవారు. అయితే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటను నష్టపోవడం, కనీసం విత్తనాలు కూడా చేతికి అందకపోవడం వల్ల కాలక్రమేణా గిరిజన ప్రాంతంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఈ ఏడాది పాడేరు డివిజన్ పరిధిలో కేవలం 12,500 ఎకరాల్లో మాత్రమే రాజ్‌మా సాగు చేశారు. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో గరిష్ఠంగా ఆరు వేల ... మిగతా 8వ పేజీలో

మినీ కిట్ల రూపంలో పంపిణీకి ఏర్పాట్లు



వచ్చే ఏడాది నూతన వంగడాలు జ్వాల, అరుణ్ రకాల విత్తనాభివృద్ధికి మినీ కిట్ల రూపంలో రైతులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. నూతన విత్తనం ఒకేసారి రైతులందరికీ పూర్తి స్థాయిలో సరఫరా చేయడం సాధ్యం కాదు. మూడేళ్ల పాటు రైతులు కేవలం విత్తనం కోసమే నూతన రకాలను సాగు చేసుకుంటే భవిష్యత్తులో విత్తన సమస్య రాదు. ఈ ఏడాది పరిశోధన స్థానంలో అరుణ్ 15, జ్వాలా 7 ఎకరాల్లో సాగు చేపట్టాం.

- డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్లాంట్ బ్రీడర్, ఆర్‌ఏఆర్ఎస్, చింతపల్లి



థింసా నృత్యం చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల వినూత్న నిరసన

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె మంగళవారానికి 36వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. మంగళవారం గిరిజన సంప్రదాయ థింసా నృత్యం చేసి నిరసన తెలియజేశారు.

- పాడేరు రూరల్

వికటించిన నాటు వైద్యం

ఇద్దరు విద్యార్థుల ఆరోగ్యం విషమం

- జిల్లా ఆస్పత్రిలో చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలింపునకు అంగీకరించని తల్లిదండ్రులు
- ఒప్పించిన టీడబ్ల్యూ డీడీ



ఇద్దరు విద్యార్థులను కేజీహెచ్‌కు అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

పాడేరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి):

ప్రస్తుతం సంక్రాంతి సెలవులు కావడంతో గ్రామాల్లో వున్న ఇద్దరు గిరిజన విద్యార్థులకు స్థానికంగా నాటు వైద్యం చేయించడంతో పరిస్థితి విషమించింది. దీంతో హుటాహుటిన 108 వాహనంలో మంగళవారం స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో ఆ ఇద్దరు విద్యార్థులను కేజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించినప్పటికీ, అందుకు వారి తల్లిదండ్రులు అంగీకరించలేదు. విషయం తెలుసుకున్న గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు జిల్లా ఆస్పత్రికి వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి ఆ ఇద్దరు విద్యార్థులను కేజీహెచ్‌కి తరలించారు.

పెదబయలు మండలం గలగండ గ్రామానికి చెందిన వంతాల సందీప్(10) పాడేరు తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో స్వగ్రామంలో ఉన్న సందీప్‌కు మూత్ర విసర్జన సమస్య రావడంతో తల్లిదండ్రులు పచ్చకామెర్లుగా భావించి పసరు మందు వైద్యం చేయించడంతో ఆరోగ్యం మరింతగా విషమించి సందీప్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో 108లో ఆ బాలుడిని స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్య సేవలు అందించిన వైద్యులు కేజీహెచ్‌కు తరలించాలని సూచించారు. అందుకు సందీప్ తల్లిదండ్రులు అంగీకరించలేదు. కాగా జి.మాడుగుల మండలం బీరం గ్రామానికి చెంది కిముడు భానులక్ష్మి(8) నీరసంగా వుండడంతో ఆమెకు దెయ్యం పట్టిందని భావించిన తల్లిదండ్రులు భూతవైద్యం చేయించడంతో పాటు పసరు మందులు వేయడంతో బాలిక మరింత నీరసించడంతో మంగళవారం సాయంత్రం జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే బాలిక భానులక్ష్మికి శరీరంలో పలుమార్పులు వచ్చి ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో ప్రాథమిక చికిత్సలు చేసిన వైద్యులు ఆమెను కేజీహెచ్‌కు తరలించాలని సూచించారు. అయితే తాము కేజీహెచ్‌కు వెళ్లబోమని భానులక్ష్మి తల్లిదండ్రులు తెగేసి చెప్పడంతో వైద్యులు ఆశ్చర్యపోయారు. దీంతో ఈ ఇద్దరు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావుకు వైద్యులు సమాచారం అందించారు.

టీడబ్ల్యూ డీడీ చొరవతో కేజీహెచ్‌కు తరలింపు

స్థానిక జిల్లా ఆస్పత్రిలో చేరిన ఇద్దరు గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉప సంచాలకుడు కొండలరావు హుటాహుటిన మంగళవారం సాయంత్రం జిల్లా ఆస్పత్రికి చేరుకుని ఆ ఇద్దరు విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులు విషమించాయని, తక్షణమే కేజీహెచ్‌కు తరలించి మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అయినప్పటికీ అందుకు సందీప్, భానులక్ష్మి తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో టీడబ్ల్యూ డీడీ పట్టు వదలకుండా తల్లిదండ్రులకు ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

కోడి పందాలపై పోలీసుల దాడులు

మునగపాక, జనవరి 16: మండలంలోని నాగవరంలో కోడి పందాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలో మామిడితోటలో కోడి పందాలు ఆడుతున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు మెరుపు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఐదు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. కోడి పందాలు అడుతున్న వారి నుంచి ఐదు వేల రూపాయల నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ తెలిపారు. అలాగే సోమవారం నాగులాపల్లిలో గుండాట ఆడుతున్న ఒక ఇంటిపై పోలీసులు దాడి చేసి ముగ్గురుని అరెస్టు చేసి, వారి నుంచి 9వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.


నాగవరంలో కోడిపందాలు ఆడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు

విస్సన్నపేటలో చోరీ

» ముగ్గురు నిందితుల అరెస్టు

కశింకోట, జనవరి 16: మండలంలోని విస్సన్నపేటలో ఆదివారం రాత్రి జరిగిన చోరీలో 14.5 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విస్సన్నపేటకి చెందిన చెక్కా కుమారి టైలరింగ్ చేస్తూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నది. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి కూడా కుమారి ఇంట్లో నిద్రిస్తున్నారు. ఆమె గదికి గడియ వేసి ఉందని తలుపు రావడం లేదని బాధితురాలు తన కుమారుడు రమేష్‌కు సోమవారం తెల్లవారుజామున ఫోను చేసి చెప్పింది. రమేష్ ఈ విషయాన్ని ఇంటి పక్కన ఉన్న వారికి ఫోన్ చేసి చెప్పగా కుమారి గది గడియ తీశారని పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేసి, అదే గ్రామానికి చెందిన షేక్ ముజెబ్, దామరౌతు నవీన్‌కుమార్, మరొక మైనర్‌ను విచారించగా నేరం అంగీకరించారన్నారు. ఈ కేసులో వీరు దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ వినోద్‌బాబు చెప్పారు.

కోడిపందాలు, పేకాట, గుండాటలపై కేసులు

పాయకరావుపేట, జనవరి 16: పాయకరావుపేట మండలంలో గడచిన రెండ్రోజులుగా పలు గ్రామాల్లో పోలీసులు దాడులు నిర్వహించి కోడిపందాలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తున్న 30 మందిపై 12 కేసులు నమోదు చేసినట్టు సీఐ పి.అప్పలరాజు మంగళవారం తెలిపారు. సంక్రాంతి, కనుమ రెండ్రోజులు పాల్తేరు, గుంటపల్లి, పెంటకోట, శ్రీరాంపురం, రాజవరం, కేశవరం, కందిపూడి గ్రామాల్లో సిబ్బందితో దాడులు నిర్వహించి, రూ.50 వేలు నగదు, నాలుగు కోళ్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ అప్పలరాజు తెలిపారు.

కోడి పందాలు, అక్రమ మద్యం తరలింపుపై దాడులు

ఎస్.రాయవరం, జనవరి 16: మండలంలోని పలు గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన కోడి పందాల శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. అలాగే మద్యం తరలిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ పొన్నాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించారు. పలు గ్రామాల్లో కోడి పందాల శిబిరాలపై దాడులు చేసి 14 మందిని అరెస్టు చేయగా, 19 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పలు చోట్ల అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 31 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ప్రసాదరావు మాట్లాడుతూ ఈ మూడు రోజుల్లో 17 కేసులు నమోదు చేసి, 45 మందిని అరెస్టు చేయడంతోపాటు 21 పందెం కోళ్లను స్వాధీనం చేసుకొన్నారు. ఈసందర్భంగా 19,710 నగదును సీజ్ చేశామన్నారు.

కోడి పందాలు ఆడుతున్న నలుగురిపై కేసు

పరవాడ, జనవరి 16 : దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్ కాలనీ సమీపంలోని జీడిమామిడితోటలో మంగళవారం కోడిపందాలు నిర్వహించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సీఐ ఎస్. బాలసూర్యారావు సిబ్బందితో దాడి చేసి, 2,700 నగదుతోపాటు మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

నక్కపల్లి, జనవరి 16: స్థానిక ఆస్పత్రి హైవే జంక్షన్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. విశాఖ నుంచి బైక్‌పై మణికంఠ, సాత్విక్‌లు యానాం వెళుతుండగా నక్కపల్లి హైవే వద్ద బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక ఆస్పత్రిలో చికిత్స అనంతరం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కొత్త అల్లుడికి 300 రకాలకుపైగా

వంటకాలతో సంక్రాంతి ఆతిథ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 16: తెలుగు వారికి పెద్ద పండుగ సంక్రాంతి. కొత్త అల్లుళ్లకు అత్తింటివారు తమ స్థోమతకు తగ్గట్టుగా మర్యాదలు చేస్తుంటారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లి దుర్గాలాడ్జి వీధికి చెందిన గుండా సాయిగోపాల్, మాధవి దంపతులు సంక్రాంతిని పురస్కరించుకుని తమ అల్లుడికి 300 రకాలకుపైగా వంటకాలతో ఆతిథ్యం ఇచ్చారు. వందలాది రకాల స్వీట్లు, తినుబండారాలు, 15 రకాల కూరలు అరటి ఆకుపై వడ్డించారు. సాయిగోపాల్ దంపతుల కుమార్తె రిషితకు డిసెంబరులో విశాఖకు చెందిన దేవేంద్రనాథ్‌తో వివాహమైంది. పెళ్లయిన తరువాత వచ్చిన మొదటి పెద్ద పండుగ కావడంతో పాటు ఇప్పటివరకు గోదావరి జిల్లాలకే పరిమితమైన ఇటువంటి సంప్రదాయాన్ని అనకాపల్లికి కూడా విస్తరింపజేయాలని ఉద్దేశంతో ఘనంగా ఏర్పాట్లు చేసినట్టు సాయిగోపాల్ తెలిపారు.


నూతన దంపతులకు వడ్డించిన పదార్థాలు

‘అమ్మఒడి’ ఇస్తామని.. లక్ష మాయం!

ఎండాడ (విశాఖపట్నం), జనవరి 16: సైబర్ నేరగాళ్లు రోజుకో ఎత్తుగడతో జనాన్ని మోసం చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వ పథకం అమ్మఒడి పేరుతో ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి లక్ష రూపాయాలు కాజేసిన సంఘటన విశాఖపట్నంలో వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. రాష్ట్ర సచివాలయం నుంచి మాట్లాడుతున్నాం అంటూ ఓ వ్యక్తి ఇటీవల నగరంలోని ఓ వార్డు వలంటీర్‌కు ఫోన్ చేశాడు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమ్మఒడి, చేయూత, విద్యా దీవెన ఎవరెవరికి అందలేదో వివరాలు తెలుసుకున్నాడు. ఆ వివరాల మేరకు నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఫోన్ చేసి, కొన్ని కారణాలతో అమ్మఒడి పథకం మీకు అందలేదని చెప్పాడు. వలంటీర్‌ను కాన్ఫరెన్స్ కాల్‌లోకి తీసుకుని అతనితో మాట్లాడించాడు. దీంతో బాధితుడికి నమ్మకం కుదిరింది. ఆ తర్వాత వలంటీర్‌ను కాన్ఫరెన్స్ కాల్ నుంచి కట్ చేసి, పథకం డబ్బు నేరుగా బ్యాంకు ఖాతాలో పడుతుందని ఆ వ్యక్తిని నమ్మించాడు. ఒక లింకును బాధితుడి మొబైల్ ఫోన్‌కు పంపి... అందులో బ్యాంకు ఖాతా వివరాలు, యూపీఐ పిన్ నంబరు ఎంటర్ చేస్తే డబ్బు జమ అవుతుందని చెప్పాడు. పిన్ నంబరు ఎంటర్ చేయగానే అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష లూటీ చేసేశాడు. దీంతో బాధితుడు లబోదిబోమంటూ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కేసును ఛేదించిన పోలీసులు నిందితుడు కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన సీరంరెడ్డి దుర్గాప్రసాద్‌గా గుర్తించారు. అతడి కదలికలపై నిఘా పెట్టి, విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	564
విజయనగరం	568
శ్రీకాకుళం	568

నేత్రపర్వంగా మకర జ్యోతి ఉత్సవాలు

» నర్సీపట్నంలో అయ్యప్ప రథయాత్ర
» ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
» గజల్స్ శ్రీనివాస్, సినీ అర్టిస్ట్ సత్యసాయి శ్రీనివాస్‌లకు సన్మానం

నర్సీపట్నం, జనవరి 16 : పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో మకర జ్యోతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. సాయంత్రం రథయాత్ర చేపట్టారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజల్స్ శ్రీనివాస్, గాయని సుజాత పాడిన పాటలు, గజముఖ నృత్య అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్ నృత్యం ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, చింతకాలయ విజయ్ చేతుల మీదుగా గజల్స్ శ్రీనివాస్, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ వి.సత్యసాయి శ్రీనివాస్, ఉమెన్ గ్రాండ్ మాస్టర్ బొడ్డా ప్రత్యూష, సినీ గాయని పెదిరెడ్ల సుజాత, యువ ఐఏఎస్ మౌర్య భరద్వాజ్ తల్లిదండ్రులు ఎంఎస్ ప్రసాద్, రాధాకుమారిలను దుశ్శాలువలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ఉర్రూతలూగించింది. చివరిగా భారీఎత్తున బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్లు పద్మావతి, రాజేశ్, ఆలయ కమిటీ ప్రతినిదులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


గజముఖ నృత్య అకాడమీ చిన్నారులతో అయ్యన్న కుటుంబ సభ్యులు


గజల్స్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం


కార్యక్రమానికి హాజరైన ప్రజలు


అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అయ్యన్న దంపతులు

రాజాధిరాజుగా ఉపమాక వెంకన్న

» కనుమ రోజు అపురూప దర్శనం » పులకించిన భక్తజనం » కోలాహలంగా స్వామి గిరి ప్రదక్షిణ

నక్కపల్లి, జనవరి 16: వెండి కిరీటంపై తలపాగా.. ఆయుధాలుగా కత్తి, డాలు.. పూల మాలలు, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరణ.. కాలుపై కాలువేసుకుని ఠీవిగా కూర్చుని, భక్తులకు అభయహస్తం ఇస్తూ రాజాధిరాజ అవతారంలో ఉపమాక వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ కనుమ పండుగ రోజు మాత్రమే కనబడే ఈ అపురూప దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఉపమాక క్షేత్రం మంగళవారం రాత్రి వరకూ భక్తజనసందోహంతో కిక్కిరిసిపోయింది. అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు స్వామివారిని రాజాధిరాజుగా అలంకరించారు. ఈ అవతారంలో పుణ్యకోటి వాహనంపై మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకూ గరుడాద్రి పర్వతం చుట్టూ గిరిప్రదక్షిణ నేత్రపర్వంగా సాగింది. భక్తులు గోవింద నామస్మరణతో గరుడాద్రి పర్వత పరిసరాలు హోరెత్తాయి. భజనలు, భక్తిగీతాలు, అన్నమయ్య కీర్తనలు, భక్తుల గోవిందనామాలు, తప్పెటగుళ్లు, తీడపెద్దు కోలాటాలతో ఆద్యంతం భక్తులను పరవశింపజేశాయి. ఉపమాక గ్రామానికి చెందిన లంక వారి కుటుంబానికి చెందిన మీగడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. బాణ సంచా పేలుళ్లు ఆకట్టుకున్నాయి.

కరి-మకరి సంవాదం

స్వామి గిరి ప్రదక్షిణోత్సవంలో వున్న సమయంలోనే మొసలి నోట చిక్కిన ఏనుగు తనను రక్షించమని స్వామిని గట్టిగా వేడుకుంటోంది. దీంతో స్వామి గిరిప్రదక్షిణోత్సవాన్ని ముగించుకుని నేరుగా ఆపదలో వున్న ఏనుగును రక్షించడానికి సరస్సు వద్దకు వెళ్తారనేది శాస్త్ర వచనం. మంగళవారం రాత్రి కూడా బంధుర సరస్సు వద్ద వున్న లంక వారి రాతి కల్యాణ మండపంపై స్వామివారిని వుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 'కరి- మకర (ఏనుగు - మొసలి) సంవాదం, ఏనుగును మొసలి బారి నుంచి రక్షించడం వంటి తంతును అర్చకస్వాములు ఆలయ సంప్రదాయం ప్రకారం నిర్వహించారు.


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు. ఇన్‌సెట్‌లో అరటిగెలల మొక్కులు తీరుస్తున్న భక్తులు

ఫార్మా వ్యర్థ జలాలు తాగి పాడి ఆవులు మృతి

» నష్టపరిహారం ఇప్పించాలని రైతుల వేడుకోలు


మృతి చెందిన పాడి ఆవు


మృతి చెందిన పాడి ఆవు వద్ద మహిళా రైతు

పరవాడ, జనవరి 16: ఫార్మాసిటీకి ఆనుకుని ఉన్న చినతాడిలో సోమవారం రాత్రి రెండు పాడి ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గుమ్మాలరాజు, కర్రి నూకరాజు పశువులను మేత కోసం ఫార్మాసిటీకి చెందిన పంప్‌హౌస్ పరిసర ప్రాంతాలకు తోలుకెళ్లారు. ఇటీవల కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు ఫార్మా వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలకు విడిచిపెడుతున్నారు. వ్యర్థాలు సమీపంలో గల గెడ్డల్లోకి కలవడం వల్ల అక్కడ నీటిని తాగిన పశువులు అనారోగ్య బారిన పడ్డాయి. రెండు రోజులుపాటు అల్లాడిపోయిన రెండు పాడి ఆవులు సోమవారం సాయంత్రం మృత్యువాత పడ్డాయి. రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ ఆవులు మృతి చెందాయని బాధిత రైతులు వాపోతున్నారు. తాము వాటిపైనే ఆధారపడి బతుకుతున్నామని, అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం ఇప్పించాలని వేడుకుంటున్నారు. ఫార్మాసిటీ నిర్వాసిత నాయకుడు బంతికోరు గోవిందరాజు మాట్లాడుతూ రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే పాడి ఆవులు మృతి చెందాయని, తక్షణమే రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మునగపాకలో ఎడ్లబండి పోటీలకు విశేష స్పందన


పోటీలను ప్రారంభిస్తున్న మాజీమంత్రి దాడి వీరభద్రరావు, ప్రగడ నాగేశ్వరరావు


ఎడ్ల పరుగు పోటీలు జరుగుతున్న దృశ్యం

మునగపాక, జనవరి 16 : సంక్రాంతిని పురస్కరించుకుని మునగపాక బైపాస్ రోడ్డులో సోమవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఎడ్లబండి పోటీలకు విశేష స్పందన కనిపించింది. ఈ పోటీలను చూడడానికి వేలాదిమంది రావడంతో బైపాస్ ప్రాంతమంతా కిక్కిరిసింది. పోటీలను మాజీమంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. అలాగే ఈ కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కూండ్రపు అప్పారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

అనంతరం ప్రథమ బహుమతి సంపత్ వినాయక (నర్సాపురం), ద్వితీయ బహుమతి అద్దేపల్లి పాలవెల్లి (చుక్కపల్లి), తృతీయ బహుమతి గండి వెంకటరావు (వాయిలపాడు), నాలుగో బహుమతి అభయ ఆంజనేయస్వామి (సింహాద్రిపురం), ఐదో బహుమతి మరిడిమాంబ (బుచ్చియ్యపేట)లకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి దాడి మాట్లాడుతూ సంక్రాంతి శోభ ఈ గ్రామంలో కనపడుతుందని అన్నారు. సంప్రదాయ పోటీలను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు.

ఘనంగా బౌద్ధ మేళా

తుమ్మపాల, జనవరి 16 : ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్నకొండ వద్ద మంగళవారం బౌద్ధ మేళా ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో బౌద్ధులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలను చేపట్టారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రధాన ద్వారం నుంచి బొజ్జన్న కొండపై గల ప్రధాన స్థూపం వరకు శాంతి ర్యాలీని చేపట్టారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొండ దిగువన ఏర్పాటు చేసిన బౌద్ధ మేళాకు ముఖ్యఅతిథిగా అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి హాజరై మాట్లాడారు. ప్రపంచ మానవాళికి బుద్ధుని మార్గం అనుసరణీయమన్నారు. బొజ్జన్నకొండ అభివృద్ధికి రూ.7.3 కోట్లను కేటాయించినట్టు చెప్పారు. ఈ నిధులతో ధ్యానమందిరం, మ్యూజిక్ సిస్టమ్‌తో కూడిన లేజర్ షో, తోరణం, అధునాతన టాయిలెట్లు తదితర వసతులు ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రముఖ బౌద్ధ భిక్షువు వెనరబుల్ డాక్టర్ ధ్యాన మహాథేరో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతిమార్గాన్ని ఎంచుకోవాలన్నారు. బౌద్ధమతంలో గల అష్టాంగమార్గాలను ఆచరించాలని సూచించారు. అనంతరం పలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సంఘాల నాయకులు బల్లా నాగభూషణం, జీవీ రూప్సీలక్ష్మి, నేలపూడి బాలరాజు, గునిపూడి అరుణబాబు, బోరా లోకేశ్వరరావు, సిద్దార్థ జాన్‌బాబు పాల్గొన్నారు.


గౌతమ బుద్ధుని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ సత్యవతి, తదితరులు

కన్నుల పండువగా బొజ్జన్నకొండ తీర్థం

ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద మంగళవారం తీర్థం కన్నుల పండువగా సాగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తీర్థప్రియులు హాజరై ఆనందోత్సవాల మధ్య గడిపారు. ప్రధానంగా పిల్లల ఆట వస్తువులు, ఇంటి గృహోపకరణాలు, తినుబండారాలు తదితర వస్తువుల అమ్మకాలు జరిగాయి. రంగులరాట్నం, స్ప్రింగ్ జంపింగ్ తదితర ఆట వస్తువుల వద్ద పిల్లలు, పెద్దలు తేడా లేకుండా ఆనందంగా గడిపారు. అలాగే పతాంగుల పోటీలు జరిగాయి. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డీఎస్పీ సుబ్బరాజు, ట్రైనీ డీఎస్పీ జి. భవ్యారెడ్డితోపాటు పట్టణ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.


బొజ్జన్నకొండపై ప్రధాన స్థూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ఎన్టీఆర్ ఆశయ సాధనే అందరి లక్ష్యం

» 18న ఎన్టీఆర్ వర్ధంతి సభను జయప్రదం చేయాలి
» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు ఆశయాలు నెరవేరాలంటే మరోసారి చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరావు అన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18న దివంగత నేత ఎన్టీఆర్ 27వ వర్ధంతిని జిల్లా కేంద్రంతో పాటు అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ సభల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. వైసీపీ పాలనలో ఉద్యోగులు, వ్యాపారులు, ఉపాధ్యాయులు,యువకులు, భవన నిర్మాణ కూలీలు, స్కీమ్ వర్కర్లు నష్టపోయారన్నారు. రాష్ట్రం పూర్తిగా వెనుకబడిపోయిందన్నారు. అంగన్‌వాడీలు సంక్రాంతి పండుగ చేసుకోకుండా తమ హక్కుల కోసం టెంట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు కొద్దిరోజులు మాత్రమే ఉన్నందున కార్యకర్తలు, నాయకులు ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి తెచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ విభాగం అధ్యక్షుడు డాక్టర్ కేకేవీ నారాయణరావు, పార్టీ నాయకులు బి.శ్రీనివాసరావు, జగన్, గణేష్ త్రినాథ, మురళి, ప్రసన్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు, తదితరులు

కొమిరలో సొరంగం వద్ద పహారా

» 24 గంటలూ అప్రమత్తంగా ఉంటున్న పోలీస్, రెవెన్యూ సిబ్బంది
» కలెక్టర్‌కు నివేదిక సమర్పణ
» పురావస్తు అధికారుల కోసం ఎదురుచూపు

రావికమతం, జనవరి 16 : మండలంలోని కొమిర గ్రామంలో బయల్పడిన సొరంగం వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది 24 గంటలూ కాపలా ఉంటున్నారు. ఈ గ్రామంలో ఇంటింటి కొళాయిల ఏర్పాటులో భాగంగా ఆదివారం పనులు చేపడుతుండగా సొరంగం బయట పడింది. దీంతో ఆ సర్పంచ్ గొర్లె రవికుమార్ అందించిన సమాచారం మేరకు తహసీల్దార్ మహేశ్వరరావు, ఎస్ఐ ఉమామహేశ్వరరావు హుటాహుటిన అక్కడికి వెళ్లారు. దానిని పరిశీలించి లోతుగా, లోపల వెడల్పుగా ఉండడంతో అందులోపలకు ఎవరినీ దిగనివ్వడం లేదు. సొరంగం చుట్టూ ఇనుప మెస్‌లు, కంచె, టార్పాలిన్‌లు ఏర్పాటు చేశారు. సొరంగం లోపల ప్రమాదకరమైన విషసర్పాలు ఉండవచ్చుననే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ లోపలికి దిగే సాహసం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని వారు హితవు పలుకుతున్నారు. పండగ సమయం కావడంతో కొమిరతోపాటు పరిసర గ్రామాల్లోని ప్రతి ఇళ్లు బంధుగణంతో కళకళలాడుతోంది. సొరంగం చూసేందుకు ఎగబడుతుండడంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గత మూడు రోజులుగా ఇక్కడ పహారా కాస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపామని, తదపరి చర్యలకు అక్కడినుంచి వచ్చిన ఆదేశాలు మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు. పురావస్తు శాఖ అధికారులు వచ్చి పరిశీలన చేస్తారన్నారు.


సొరంగం వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కాపలా. ఇన్‌సెట్‌లో సొరంగం

సొరంగంలోకి వెళ్లే ప్రయత్నం చేశాను

అప్పికొండ అర్జున, యువకుడు, కొమిర

పైపులైన్ పనులు ఆదివారం మా ఇంటికి సమీపంలోనే జరుగుతున్నాయి. గ్రామ సచివాలయం దగ్గర గల ఊర మెట్ట కింద భాగంలో ఈ సొరంగం బయట పడింది. వెంటనే నేను పదిహేను నుంచి ఇరవై అడుగుల మేర లోపలికి దిగి వెళ్లారు. లోపలకు దిగే కొద్ది నున్నగా చీకటిగా ఉండి ఊపిరాడక వెనుదిరిగాను. లోపల చీకటిగా ఉండడంతో భయం అనిపించింది. మరోసారి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా సర్పంచ్ రవికుమార్ వచ్చి మందలించడంతో పైకి వచ్చేశాను.



పండగ పూట రోడ్డుపై ఉంచారు

» అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి

» కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె.. నిరసనలు

పాడేరు రూరల్, జనవరి 16: సంక్రాంతి పండగ పూట కూడా సీఎం జగన్ తమను రోడ్డుపై ఉంచారని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. మంగళవారం నాటికి సమ్మె 36వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా పాడేరు శిబిరంలో ధింసా నృత్యం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ రాష్ట్ర యూనియన్ నాయకులతో ఐదు పర్యాయాలు చర్చలు జరిపినప్పటికీ సమస్యలు పరిష్కరించకపోవడం విచారకరమని వాపోయారు. సంక్రాంతిలోగా సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించినప్పటికీ జగన్ ప్రభుత్వం మొండి వైఖరి కారణంగా రోడ్డుపైనే ఉండాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నుంచి 24 గంటల సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిన్నారి, అంబిక, దేవి, జానకి, భాగ్య, సావిత్రి, కొండమ్మ, భువనేశ్వరి, భవాని, చిన్నతల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

సాగు హక్కు పట్టాలు అందక అవస్థలు

» నిమ్మలపాడు గిరిజనుల ఆందోళన



విలేకరులతో మాట్లాడుతున్న నిమ్మపాడు గిరిజనులు

గూడెంకొత్తవీధి, జనవరి 16: మండ కేంద్రంలోని నిమ్మపాడు గ్రామంలో సాగు హక్కు పట్టాలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నామని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక గిరిజనులు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో సుమారు 40 కుటుంబాల వారమంతా ఏభై ఏళ్లుగా నివాసం ఉంటున్నామని చెప్పారు. ఒక్కొక్క కుటుంబానికి నాలుగు, ఐదు ఎకరాల చొప్పున అటవీ భూములు ఉన్నాయన్నారు. ఏళ్ల తరబడి అటవీ భూములను సాగు చేసుకుంటున్నప్పటికీ పట్టాలు లేక ప్రభుత్వ పథకాలకు దూరం కావాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు భూములు ఉన్నప్పటికీ పట్టాలు లేక రైతుభరోసా నిధులు అందడం లేదన్నారు. అలాగే ఎరువులు, విత్తనాలు, బ్యాంకు రుణాలు పొందే అవకాశం లేకపోతున్నదని వాపోయారు. వైసీపీ అధికారంలోకి వస్తే పట్టాలు వస్తాయని ఆశపడ్డామని, నాలుగున్నరేళ్లుగా పలు మార్లు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకపోయిందని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి రైతుల అటవీ భూములకు సాగు హక్కు పత్రాలు అందజేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

వంజరిలో తాగునీటికి కటకట



తాగునీటి కోసం కొళాయి వద్ద నిరీక్షిస్తున్న వంజరి మహిళలు

జి.మాడుగుల, జనవరి 16: మండలంలోని వంజరి పంచాయతీ కేంద్రంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. పేరుకు పంచాయతీ కేంద్రమైనా తాగునీటి వనరులు లేకపోవడంతో గుక్కెడు నీటికి స్థానిక ప్రజలు కటకటలాడుతున్నారు. గ్రామంలో 70 కుటుంబాలు జీవనం సాగిస్తున్నా అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో తమకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదని మహిళలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గ్రావిటీ ద్వారా తాగునీటి పథకాలు ఉన్నప్పటికీ చుక్క నీరు ఇవ్వని పరిస్థితి ఉందని వాపోతున్నారు. సంక్రాంతి వేళలో కనీస బిందెడు తాగునీరు దొరకడం గగనంగా మారడంతో తీవ్రమైన పాట్లు పడుతున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు సైతం మొరపెట్టుకున్నా పరిస్థితి మారడం లేదని వాపోయారు. ఇప్పటికైనా తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

వికటించిన నాటు వైద్యం

... 5వ పేజీ తరువాయి





బాలుడు సందీప్‌ను పరామర్శిస్తున్న టీడబ్ల్యూ డీడీ కొండలరావు... ఆస్పత్రిలో బాలిక భానులక్ష్మి

కౌన్సిలింగ్ చేసి, వారికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించి విద్యార్థులను కేజీహెచ్‌కు తలించేందుకు ఎట్టకేలకు ఒప్పించారు. దీంతో ఒకే అంబులెన్సులో సందీప్, భానులక్ష్మిని కేజీహెచ్‌కు తరలించారు. విద్యార్థులను కేజీహెచ్‌కు తరలించేందుకు ఎంతో చొరవ చూపిన టీడబ్ల్యూ డీడీ కొండలరావును ఐటీడీఏ అధికారులు, జిల్లా ఆస్పత్రి వైద్యులు అభినందించారు.

సంత షెడ్లు నిరుపయోగం

... 5వ పేజీ తరువాయి

వర్తకులు అంటున్నారు. సంతకు తీసుకువచ్చిన అటవీ/వ్యవసాయ ఉత్పత్తులను పెట్టుకుని విక్రయించేందుకు వసతి లేకపోవడంతో ఎక్కడో ఒక చోట వాటిని పెట్టి ఏదో ధరకు విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతుందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి ఇప్పటికైనా ఏజెన్సీ వారపు సంతల్లో వసతి సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

టెస్ట్ మ్యాచ్ టికెట్లపై అయోమయం

ఆన్‌లైన్‌లో ఐదు రోజుల సీజన్ టికెట్లు.. కనిపించని రోజువారీ టికెట్లు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 16:

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య వచ్చే నెల రెండో తేదీ నుంచి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించి ఆన్‌లైన్ (పేటీఎం ఇన్‌సైడర్)లో ద్వారా చేపట్టిన టికెట్ల అమ్మకాలకు స్పందన అంతంతమాత్రంగానే ఉంది. విక్రయాలు (ఈనెల 15 నుంచి) ప్రారంభించి రెండు రోజులైనా ఇప్పటికీ టికెట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఆన్‌లైన్‌లో కేవలం ఐదు రోజుల సీజన్ టికెట్లు (రూ.400, రూ.800, రూ.1000) మాత్రమే ఉన్నాయి. నిర్వాహకులు ప్రకటించిన రూ.1500 టికెట్లు కనిపించడం లేదు. కనీసం అమ్ముడైపోయినట్టు (సోల్డ్ అవుట్) కూడా చూపడం లేదు. ఇక రూ.100, 200, రూ.300, రూ.500 ధర గల రోజువారీ టికెట్ల విక్రయాలపై అయోమయ పరిస్థితి నెలకొంది. పేటీఎం ఇన్‌సైడర్‌లో రోజువారీ టికెట్లు అమ్ముడైయినట్టు చూపకపోవడంతో క్రీడాభిమానులలో అనుమానాలు నెలకొన్నాయి. ఐదు రోజుల సీజన్ టికెట్లకు సంబంధించి మంగళవారం రాత్రి సమయానికి ఎం, ఎం-1 స్టాండ్‌లో రూ.400, 'ఎఫ్' స్టాండ్‌లో రూ.800 టికెట్లు, అలాగే సౌత్ వెస్ట్ అప్పర్ స్టాండ్, సౌత్ ఈస్ట్ అప్పర్ స్టాండ్‌తోపాటు జీ, హెచ్, ఐ స్టాండ్స్‌లో రూ.1000 టికెట్లు అందుబాటులో ఉన్నట్టు పేటీఎం ఇన్‌సైడర్‌లో చూపుతున్నాయి. రూ.1500 ధర గల సీజన్ టికెట్లు, అలాగే రూ.100, 200, రూ.300, రూ.500 ధర గల రోజువారీ టికెట్లకు సంబంధించి ఇన్‌సైడర్‌లో ఎటువంటి సమాచారం కనిపించడం లేదు.

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలు

కొయ్యూరు/జి.మాడుగుల/డుంబ్రిగుడ, జనవరి 16: మన్యంలో సంక్రాంతి వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గ్రామాల్లో మకర సంక్రాంతిని పురస్కరించి చెట్టు భజనలు, ధింసా నృత్యాలతో పండగను జరుపుకున్నారు. కొయ్యూరు మండలంలోని పలు గ్రామాల్లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చెట్టుభజనలు నిర్వహించారు. మంగళవారం కనుమ పండగను పురస్కరించి డౌనూరు, రామరాజుపాలెం, కొయ్యూరు తదితర గ్రామాలలో బోనంగి ప్రసాద్, లోతా భీమరాజు తదితరులు ఆధ్వర్యంలో గో పూజలు చేశారు. అలాగే చాలా గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి, విజేతలకు బహుమతులను అందజేశారు. జి.మాడుగుల మండలంలో సంక్రాంతి సందడి నెలకొంది. మంగళవారం కనుమ పురస్కరించుకుని గిరిజనులు కోలాటాలు, భజనలు, వివిధ వేషధారణాలు ధరించి ఉత్సాహంగా గడిపారు. అలాగే గిరిజన యువకులు సంప్రదాయంగా బుడియాలు సేకరించారు. డుంబ్రిగుడ మండలంలో గిరిజన మహిళల ఇళ్ల ముందర రంగురంగుల ముగ్గులను వేసుకుని గోమాతలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. డుంబ్రిగుడలోని కిడారి సామాజిక భవనంలో సర్పంచ్ వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, జీసీసీ సూపరింటెండెంట్ దామోదరం, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, టీడీపీ అరకు పార్లమెంట్ ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు సుబ్బారావు, వైసీపీ నాయకురాలు నిర్మల, ఉపాధ్యాయులు సహాయ సహకారాలు అందించారు. చాలా గ్రామాల్లో సంక్రాంతి సంబరాలతో యువతీ, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా గడిపారు.



డుంబ్రిగుడలో ధింసా నృత్యం ప్రదర్శిస్తున్న గిరిజనులు

గ్రామాల్లో చెట్టు భజనలు, ధింసా నృత్యాలతో సందడి



కొయ్యూరు: ఆడాకులలో గిరిజన యువతులు వేసిన ముగ్గులు





జి.మాడుగులలో ధింసా నృత్యం చేస్తున్న గిరిజన యువత... (ఇన్‌సెట్‌లో) విచిత్ర వేషధారణలతో బుడియలు సేకరిస్తున్న గిరిజనులు

వారపు సంతల్లో సదుపాయాలు కరువు

మండలంలోని వారపు సంతల్లో మౌలిక సదుపాయాలు కొరవడ్డాయి. ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు వచ్చిపోతున్నా వారపు సంతల అభివృద్ధిలో మాత్రం ఎటువంటి మార్పులు కానరావడం లేదు. ఫలితంగా వివిధ ప్రాంతాల నుంచి సంతకు వచ్చే వ్యాపారులు, రైతులు వినియోగదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

» చాలా గ్రామాల సంతల్లో కానరాని షెడ్లు

» కర్రల సాయంతో పాకల ఏర్పాటు

» వ్యాపారులు, వినియోగదారుల అగచాట్లు

» పట్టించుకోని పాలకులు, అధికారులు

ముంచంగిపుట్టు, జనవరి 16:

మండల కేంద్రంతో పాటు జోలాపుట్టు, బూసిపుట్టు, బంగారుమెట్ట, లక్ష్మీపురం గ్రామాల్లో వారపు సంతలు జరుగుతున్నాయి. ఆయా సంతల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి కనీసం రేకుల షెడ్లను సైతం అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో సంతలో వ్యాపారులు కర్రల సహాయంతో చిన్నపాటి పాకలను వేసుకొని వ్యాపార లావాదేవీలు సాగించాల్సిన దుస్థితి దాపురించింది. ఫలితంగా చినుకుపడితే చాలు దుకాణాల్లోకి వర్షపు నీరు వచ్చిచేరడంతో విలువైన సామాన్లు పాడవుతున్నాయి. దీనివల్ల అపార నష్టం వాటిల్లుతుందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సంతల ప్రాంగణంలో సీసీ రోడ్లు, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు మచ్చుకైనా కానరావడం లేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు, వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో మహిళలు అత్యవసర సమయాల్లో అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. సంతల అభివృద్ధికి తగిన చర్యలు చేపడతామని తరచూ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నారే తప్పితే, వారి మాటలు మాత్రం కార్యరూపం దాల్చడంలేదు.



కర్రల సాయంతో వేసుకున్న పాకల్లో నిర్వహిస్తున్న దుకాణాలు (ఫైల్)

ఇప్పటికైనా వారపు సంతల అభివృద్ధిపై పాలక ప్రభుత్వం, అధికారిక యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించాలని వ్యాపారులు, రైతులు, వినియోగదారులు ముక్త కంఠంతో వేడుకుంటున్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



మోదకొండమ్మ ఆలయం బారులు తీరిన భక్తులు

పాడేరు రూరల్, జనవరి 16: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండగ నేపథ్యంలో పట్టణ వాసులతో పాటు వంజంగి మేఘాల పర్వతాన్ని సందర్శించేందుకు వచ్చిన పర్యాటకులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. దీంతో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారింది. భక్తులకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు పర్యవేక్షణలో ఉదయం ప్రసాదం, మోదకిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్టు ఛైర్మన్ శివరాత్రి శ్రీనివాస్‌కుమార్ పర్యవేక్షణలో మధ్యాహ్నం అన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, పోతురాజు, దేముడు, ముకుందరావు, కొండలరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న సినీ డైరెక్టర్ పరశురాం



సినీ డైరెక్టర్ పరశురాంను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ప్రముఖ సినీ డైరెక్టర్ పరశురాం కుటుంబ సభ్యులతో మంగళవారం మోదకొండమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పరశురాం దంపతులను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, కె.రమేష్ నాయుడు తదితరులు శాలువతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. అలాగే గ్రామ/వార్డు సచివాలయ రాష్ట్ర అడిషనల్ కమిషనర్ స్వామినారాయణ దంపతులు కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రా.. కదలిరా సభను విజయవంతం చేయాలి

» టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మణరావు

చింతపల్లి, జనవరి 16: అరకులో ఈ నెల 20వ తేదీన జరగనున్న రా.. కదలిరా సభను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు కోరారు. చౌడుపల్లి పంచాయతీ బైలుకించంగి గ్రామంలో మంగళవారం టీడీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు పార్లమెంట్ పరిధిలోని టీడీపీ క్యాడర్‌లో నూతనోత్సాహం నింపేందుకు తలపెట్టిన రా.. కదలిరా కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమికి ఆదివాసీలు నాంది పలకాలన్నారు. ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి, నాలుగున్నరేళ్ల పాలనలో ఆదివాసీలు అభివృద్ధికి దూరమైపోయారన్నారు. ఆదివాసీల కోసం ఒక్క ప్రత్యేక పథకం అమలుచేసిన దాఖలాలులేవన్నారు. గిరిజన గ్రామాల్లో ప్రజలు రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 15 రకాల పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనులందరూ టీడీపీ అండగా నిలవాలన్నారు. వైసీపీ మోసాలను ఎండగట్టేందుకు సిద్ధం కావాలన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అరడా వీరబాబు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు అప్పియమ్మ, సునీల్ పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతున్న చల్లంగి లక్ష్మణరావు

ఆహ్లాదకరంగా కొత్తపల్లి జలపాతం

» ఏపీ ఆర్‌టీఐ కమిషనర్ చెన్నారెడ్డి

జి.మాడుగుల, జనవరి 16: ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన కొత్తపల్లి జలపాతం ఆహ్లాదకరంగా ఉందని ఏపీ ఆర్‌టీఐ కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించారు. జలపాతంలో కొంతసేపు సేదతీరారు. అలాగే ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ఏకో-టూరిజం సభ్యులు సహాయంతో అన్ని పరిసరాలను పరిశీలించారు. జలపాతం సుందరంగా ఉందని ఆయన కితాబునిచ్చారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

గూడెంకొత్తవీధి, జనవరి 16: మండలంలోని కంపుమానుపాకలు గ్రామంలో ఆదివాసీలకు టీడీపీ నాయకుడు ముక్కలి మహేశ్ దుస్తులు పంపిణీ చేశారు. సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం గిరిజన మహిళలకు చీరలు, వృద్ధులకు పంచెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు ముక్కలి కల్యాణి, అప్పన్న, ఎం.బాలయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

కారు అద్దాలు ధ్వంసం

జి.మాడుగుల, జనవరి 16: మండల కేంద్రం రామాలయ వీధికి బుజ్జి అనే వ్యక్తికి చెందిన కారు అద్దాలను సోమవారం దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలో ఇటువంటి సంఘటనలు ఇటీవల చోటు చేసుకుంటున్నాయని, పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

'తాగునీటి పథకం మరమ్మతుల్లో నిర్లక్ష్యం సరికాదు'

డుంబ్రిగుడ, జనవరి 16: మండల కేంద్రంలోని సంతవలసలో తాగునీటి పథకం మరమ్మతు పనుల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు అన్నారు. సంతవలసలోని పోలీసు స్టేషన్ వీధిలో తాగునీటి పథకం అస్తవ్యస్తంగా తయారైందని, తాగునీటి పైపులు పగిలిపోయి నీరు వృథాగా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది జరిగి నెల రోజులు గడుస్తున్నా చర్యలు చేపట్టడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సురక్షిత నీటికి నోచుకోలేని దుస్థితి గిరిజనులకు ఏర్పడిందని వాపోయారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి గొట్టాలను మరమ్మతు చేసి రక్షిత నీటిని సరఫరా చేయాలని కోరారు. లేనిపక్షంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

త్వరలో అందుబాటులోకి మేలి రకం రాజ్‌మా

... 5వ పేజీ తరువాయి

ఎకరాల్లో సాగు చేపట్టారు. ఆదివాసీ రైతులు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో లేకపోవడం వల్లే రాజ్‌మా సాగుకు దూరమవుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన చింతపల్లి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నూతన రాజ్‌మా వంగడాలపై 2022లో పరిశోధనలు ప్రారంభించాం.

రెండేళ్లుగా రాజ్‌మా పంటపై పరిశోధనలు

రాజ్‌మా నూతన వంగడాల అభివృద్ధికి రెండేళ్లుగా పరిశోధనలు చేపడుతున్నారు. 2022లో అసోం, హిమాచల్‌ప్రదేశ్ వ్యవసాయ పరిశోధన స్థానాల నుంచి ఆరు రకాల రాజ్‌మా విత్తనాలను దిగుమతి చేసుకుని పరిశోధనలు ప్రారంభించారు.

ఆశాజనకంగా జ్వాల, అరుణ్

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్న ఆరు రకాల వంగడాల్లో జ్వాలా అరుణ్ ఆశాజనకంగా ఉన్నట్టు గుర్తించారు. అసోం, హిమాచల్‌ప్రదేశ్ వ్యవసాయ పరిశోధన స్థానాల నుంచి దిగుమతి చేసుకున్న అంబెర్, ఫాల్గుణ, అరుణ్, ఉత్కర్ష్, ఉదయ్, జ్వాలాతో పాటు ప్రాంతీయంగా లభించే చింతపల్లి రెడ్ విత్తనాలపై శాస్త్రవేత్తలు 2022లో ప్రయోగాత్మక సాగు చేపట్టారు. ప్రధానంగా గింజ పరిమాణం, దిగుబడి, తెగుళ్ల తట్టుకునే శక్తితో పాటు పోషక విలువలు, రుచి ఆధారంగా గిరిజన ప్రాంతానికి జ్వాల, అరుణ్ రకాలు అత్యంత అనుకూలంగా ఉన్నట్టు శాస్త్రవేత్తలు ప్రాథమికంగా నిర్ధారించారు.

ప్రతికూల పరిస్థితుల్లోనూ దిగుబడులు

ఈ ఏడాది పరిశోధన స్థానంలో చేపట్టిన రాజ్‌మా ప్రయోగాత్మక సాగులో అరుణ్, జ్వాల రకాలు ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఆశించి దిగుబడులు వచ్చాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అరుణ్, జ్వాల రకాలు 2022లో ఎకరానికి 600 కిలోల దిగుబడులు వచ్చాయి. ఈ ఏడాది సెప్టెంబరులో నాట్లు వేయగా నవంబరులో పిండెకట్టే దశలో వర్షాలు లేవు. పంట చేతికందే సమయంలో మిచౌంగ్ తుఫాను విరుచుకు పడింది. ఈ కారణాల వల్ల రాజ్‌మా పంటకు అపార నష్టం కలిగింది. ఈ ప్రతికూల పరిస్థితులను సైతం తట్టుకుని అరుణ్ ఎకరానికి 450 కిలోలు, జ్వాలా 350 కిలోల దిగుబడులు వచ్చాయి. కాగా పాడేరు రెవెన్యూ డివిజన్‌లో రైతులు నాట్లు వేసుకున్న చింతపల్లి రెడ్ రకం పంట పొలాల్లో ఎకరానికి కేవలం 50-70 కిలోల దిగుబడులు మాత్రమే వచ్చాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఏడాది పరిశోధనల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం ఆరుణ్, జ్వాల రకాలు తట్టుకుని మంచి దిగుబడులనిస్తాయని గుర్తించామని శాస్త్రవేత్తలు అంటున్నారు.





జ్వాల రకం రాజ్‌మా విత్తనాలు... శ్రీకాకుళం సన్నాల వరి విత్తనాలు

మార్కెట్‌లో మంచి డిమాండ్



\- డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్, ఏడీఆర్

రాజ్‌మా లాభదాయక పంట. జ్వాలా, అరుణ్ రాజ్‌మా గింజలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉం ది. గ్రేడింగ్ ఆధారంగా కిలో రూ.120-150ధర లభిస్తున్నది. గిరిజన ప్రాంతంలో గంజాయికి ప్రత్యామ్నాయ పంటగా రాజ్‌మా సాగును ప్రోత్సహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. రైతుల వద్ద నాణ్యమైన విత్తనం లేదు. పూర్వం నాటి చింతపల్లి రెడ్ రకాలు మాత్రమే సాగు చేసుకుంటున్నారు. రైతులకు అరుణ్, జ్వాలా రకాల విత్తనాలు అందుబాటులోకి వస్తే దిగుబడి, ఆదాయంలో భారీ మార్పు వస్తుంది. ఈ గింజలు పొడవుగా, ఆకర్షణీయంగా, మంచి పోషక విలువలు కలిగి ఉంటాయి.

శ్రీకాకుళం సన్నాలు వరి విత్తనాలు

చింతపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శ్రీకాకులం సన్నాలు (ఆర్‌జీఎల్2537) వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ప్లాంట్ బ్రీడర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పరిశోధన స్థానంలో విత్తనాభివృద్ధి కోసం శ్రీకాకుళం సన్నాల వరి విత్తనాలు ఉత్పత్తి చేసినట్టు చెప్పారు. ఐదు టన్నుల వరి విత్తనాల నిల్వలు పరిశోధన స్థానంలో ఉన్నాయన్నారు. ఎకరానికి 30 కిలోల విత్తనం అవసరమన్నారు. రైతులకు 75 కిలోల బస్తాను రూ.1800 ధరగా నిర్ణయించినట్టు ఆయన చెప్పారు. ఖరీఫ్ సాగుకు విత్తనాలు అవసరమైన రైతులు పరిశోధన స్థానాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.